## "ప్రోక్స్.........."

పోస్ట్‌మాన్ విసిరిన కవరు కిటికీలోంచి రివ్వున దూసుకుని వచ్చి నేలమీద వాలింది.

వంటపని ముగించుకుని తీరుబడిగా కుర్చీలో కూర్చుని స్వెట్టరు అల్లుకుంటున్న "సీత" ఒక్క ఉదుటునలేచి ఒంగి కవరు అందుకుంది.

ఫ్రమ్ అడ్రస్ చూడగానే ఆమె పెదవులమీద సన్నటి చిరునవ్వు విరిసింది.

ఆ లేఖ మిత్రురాలు "సుధారాణి" దగ్గర నుంచి!

ముచ్చటగా మూడు సంవత్సరాలు వెనక్కి వెడితే సుధారాణి ఆమెకి కాలేజి మేట్!

ఇద్దరిమధ్య చెప్పుకోతగ్గ గొప్ప స్నేహం లేకపోయినా ఒకటే గ్రూప్ కావటంచేత మంచి పరిచయమే వుంది.

క్రిందటి నెలలో సీత తలవని తలంపుగా పిన్నికూతురు పెళ్ళికి తప్పనిసరిగా హైద్రాబాద్ వెళ్ళవలసి వచ్చింది!

పిల్లలకి పరీక్షలు, భర్తకి ఆఫీసుపని ఒత్తిడి వుండటంచేత పెళ్ళికి ఒంటరిగా వెళ్ళింది.

అదిగో....అప్పుడే పాతమిత్రురాలు సుధారాణి అనుకోకుండా కింగ్‌కోటి సెంటర్‌లో కనుపించింది.

పుట్‌పాత్‌మీద నిల్చుని పువ్వులు కొంటున్న సీత....

"హలో సీతా! బాగున్నావా?" అన్న పలకరింపుతో ఆత్మీయంగా భుజంమీద చెయ్యి పడేసరికి వులికిపాటుతో తల తిప్పింది!

ఎదురుగా సుధారాణి!

"జ్ఞాపకం వున్నానా?" నవ్వుతూ పరామర్శించింది సుధ.

సీత కళ్ళు గుర్తింపుతో సంతోషంగా మెరిశాయ్!

కాలేజీ రోజుల్లో బొట్టు, గాజులు లేకుండా పెద్ద పెద్ద ఇయర్‌రింగ్స్‌తో, పల్చటి ఖరీదయిన దుస్తుల్లో అల్ట్రా మోడరన్‌గా వుండే సుధారాణి– మెళ్ళో నల్లపూసల గొలుసు, ముక్కుకి ఒంటి ముత్యం పుల్ల, చెవులకి పెద్దసైజు దుద్దులు, ఒంటికి అందంగా అమరిన గద్వాల్ పట్టుచీరతో ఎదురుగా నిలబడేసరికి సుమిత్రకి మతి తప్పినంత పని అయి కళ్ళు సంభ్రమంతో విచ్చుకున్నాయి!

"హలో సుధా! నువ్వా! జ్ఞాపకం లేకేం? కాని....చా....లా....మారిపోయావ్?" అంది ఆశ్చర్యంతో పరిశీలనగా చూస్తూ.

సన్నగా నిండుగా నవ్వింది సుధారాణి.

ఆ విధంగా పలకరింపులు అయిన తరువాత వద్దు వద్దు అంటున్నా వినకుండా పట్టుబట్టి సీతని బషీర్‌బాగ్‌లో వున్న తమ ఇంటికి తీసుకుని వెళ్ళింది సుధారాణి.

భర్త ఆఫీసరు!

పెద్ద బంగళా, టెలిఫోన్, ఖరీదయిన ఫర్నిచరుతో ఇల్లు చాలా అందంగా అధునాతనంగా వుంది. ప్రతి వస్తువు ఆ యింటి హోదాని చాటి చెపుతోంది.

సుధారాణి అగర్భ శ్రీమంతుల బిడ్డ! అందువల్ల ఆ గృహ వాతావరణం సీతకి ఆశ్చర్యాన్ని కలిగించలేదు! కానీ....

అహంకారంతో మిడిసిపడుతూ, గర్వంగా అప్టుడేట్‌గా వుండే సుధారాణిలోగల ఈ సౌమ్యానికి, కలుపుగోలుతనానికే విస్తుపోవాల్సి వస్తోంది!

"సీతా! మా యింట్లో రెండురోజులు వుండకుండా వెళ్ళటానికి వీలులేదు...." శాసించినట్లు పట్టుపడుతూ అంది సుధారాణి.

"ప్లీజ్! ఈసారికి వదిలేయి సుధా! ఇంకోసారి తప్పకుండా వస్తాగా! పిల్లలకి పరీక్షలు, ఆయనకి ఆఫీస్ ఆడిట్ జరుగుతోంది. ఇంక తప్పనిసరిగా పెళ్ళికి రావల్సివచ్చింది..." అంది ఇబ్బందిగా సీత.

ఆ రాత్రి అక్కడే భోజనం చేసింది.

"వంట – భర్త – పిల్లలు....దీజ్ ఆర్ ఆల్ నాన్సెన్స్ టాపిక్స్ ఐ హేట్ దెమ్...." అని చీదరించుకునే సుధారాణి ఆనాడు స్వయంగా వంటచేసి వడ్డించటం మరీ వింత అనిపించింది.

"అదేమిటే? ఇంతపెద్ద ఆఫీసరుగారి భార్యవి...వంటమనిషి లేదా?"

మళ్ళీ సుధ దగ్గర్నుంచి చిరునవ్వే సమాధానం!

మొత్తంమీద ఆరోజు చాలా మర్యాదే చేసింది. పాత స్నేహితురాలికి ఎంతో ప్రేమతో ఆతిథ్యమిచ్చింది.

ఇంతలో భర్త వస్తే పరిచయం చేసింది.

అతడు కూడా ఆఫీసరు హోదాలో చాలా హుందాగా నిగర్వంగా అనిపించాడు. ఇద్దరు పిల్లలు! ఆ సంసారం చూడ ముచ్చటగా కనువిందు చేసింది సీతకి.

సీత వచ్చేస్తుంటే బీరువా తెరిచి జాకెట్టు బట్ట, పూలు అందించింది సుధారాణి.

మిత్రురాలి అభిమానానికి ఆర్ద్రతతో సీత మనసు మూగబోయింది.

"స్నేహంలో ఇంత తియ్యదనముంటుందా?"

"సీతా! అప్పుడప్పుడు లెటర్సు వ్రాస్తూ వుంటావుగా?" ఆప్యాయంగా చెయ్యి పట్టుకుంది సుధారాణి!

"..........."

"ఏమిటే సీతా! మాట్లాడవ్? ఆస్తమానం నేను వాగటమేనా?"

"ఛ....ఛ....అదికాదే! ఇన్నేళ్ళ తరువాత తిరిగి మనమిద్దరం ఇలాగ కల్సుకోవటం. నిజంగా నాకు చాలా ఆనందంగా వుంది. కాని...."

"చెప్పు! సందేహం దేనికి?"

"కాని... అప్పటి సుధకి ఇప్పటి సుధకి చాలా తేడా కనుపిస్తోంది నాకు. ఆ అలవాట్లు ఆ పోలికలు నీలో ఇప్పుడు కాగడాపెట్టి వెదికినా కనుపించటం లేదు! పదహారణాల తెలుగు పడుచులాగ మారిపొయ్యావ్...."

సన్నగా నవ్వింది సుధారాణి.

ఒక్కసారి ఎదురుగా టేబిల్ మీద కేస్‌లో వున్న భర్తఫొటో కేసి దృష్టి తిప్పుకుంది.

"నిజమే సీతా! ఒకోసారి ఇప్పుడు నన్ను తల్చుకుంటే నాకే ఆశ్చర్యం అనిపిస్తుంది. బాహ్యంగానే కాదు. నాలో మానసికంగానూ మార్పు వచ్చింది. మన పాత ఫ్రెండ్సు ఎవరు కనుపించినా ఆ మాటే అంటున్నారు. ఒక్కటి చెప్పు. పరిస్థితులకి అనుగుణంగా మనం మారటంలో తప్పు వుందంటావా?" కళ్ళెత్తి ప్రశ్నించింది.

"అలాగ నేను ఎందుకు అంటానే! మార్పు మానవ సహజం! పరిస్థితులకి అనుగుణంగా మనం మారకపోతే జీవితం నరకసదృశం అవుతుంది...."

"అందుకే....అందుకే నేను మారాను సీతా! ఈ మార్పు నాలో మనస్ఫూర్తిగా వచ్చింది. జీవితాన్ని నరకం చేసుకున్నా స్వర్గం చేసుకున్నా నా చేతుల్లోనే వుంది అని అన్నట్టుగా ఇప్పుడు

నా సంసారం స్వర్గధామం! అదంతా చెప్పాలంటే పెద్ద కథ!" నవ్వింది సుధారాణి.

"నీకు ట్రైన్‌కి టైము అవుతోంది కదా! వివరంగా లెటర్ వ్రాస్తాలే...." అంది చెయ్యి మృదువుగా నొక్కుతూ.

అంతే!

ఆ తరువాత సీత వచ్చెయ్యటం తీరిక చేసుకుని క్షేమ సమాచారాలతో సుధకి ఉత్తరం వ్రాయటం జరిగింది. ఇవాళో రేపో ఆమె దగ్గర్నుంచి సమాధానం వస్తుందని ఎదురుచూస్తూనే వుంది. ఇదిగో....ఇప్పుడు రానే వచ్చింది!

*

చేతిలోని అల్లిక సూదులు ప్రక్కకి పెట్టి కుతూహలంగా కవరు విప్పింది సీత.

ఆమె కళ్ళు చురుగ్గా అక్షరాల వెంట పరుగులు పెట్టాయ్.

"ప్రియమైన సీతా!" అంటూ మొదలైన ఆ లేఖ ఉభయకుశలోపరితో ప్రారంభమై సంసార విషయాల్లోకి దిగింది.

సీతా!

నేను చాలా మారానని ఆ రోజు నువ్వ అన్నావ్! నువ్వేకాదు. గతంలో నన్ను తెలిసిన ప్రతి ఒక్కరు ఆ మాటే అంటున్నారు.



నా జీవితంలో జరిగిన కొన్ని ముఖ్యమైన సంఘటనలు నీ ముందు పెడితే నాలో మార్పుకి కారణం నీకు తెలుస్తుంది.

నేను మా పుట్టింట ఎంత అపురూపంగా పెరిగానో నీకు తెలుసు. పనిమనిషి కాఫీ కప్పు సహితం మంచం దగ్గరికి అందించేది. మంచి నీళ్ళతో సహా అమిరాకనే భోజనం బల్ల ముందు కూర్చునేదాన్ని. ఒక్కర్తినే ఆడపిల్లనని అమ్మ నాన్న కూడా బాగా గారాబం చేశారు. అందుకు ఐశ్వర్యం దోహదం అయ్యింది. వంట చెయ్యటం అన్నా మన పాత పద్ధతులు అన్నా నాకు తగని తలనొప్పి.

డబ్బు నీళ్ళలా ఖర్చు పెడుతూ సినిమాలు పార్టీలు, పిక్‌నిక్‌లు అంటూ స్టూడెంట్ లైఫ్‌ని ఎంజాయ్ చేశాను.

వివాహం అయి వేరింటి కాపురం పెట్టినా ఆ అలవాట్లు మార్చుకోలేకపోయా ను. నేను వెళ్ళేసరికే ఆయనకి వంట మనిషి, పని మనిషి వున్నారు. వంటమనిషిని మానిపిద్దామని ఆయన అంటే నేను ఒప్పుకోలేదు. అందువల్ల తిరిగి నా అలవాట్లు నిరాఘాటంగా కొనసాగాయి. కొత్త వూరు అయినా అతి త్వరలోనే క్లబ్బులూ మహిళా సమాజాలవారితో అనుబంధం కుదిరి "సోషల్ వర్క్" పేరిట బాధ్యత పెరిగింది. తత్ఫలితంగా మా ఇద్దరి మధ్య అభిప్రాయభేదాలు! మనస్పర్థలు! తియ్యగ సాగిపోవాల్సిన మా జీవనరాగం అపశృతి పలికింది.

ఆయన మధ్యాహ్నం భోజనానికి వచ్చినపుడు నేను ఏ రోజూ ఇంట్లో వుండేదానను కాను. వంటవాడే వడ్డించి చూసుకునేవాడు! ఈ విషయంలో ఆయన నన్ను రెండు మూడుసార్లు మందలించారు. అయినా నేను లక్ష్యపెట్టలేదు. అంతే! నా నిరసనకి ఆయన బాగా గాయపడ్డారనుకుంటాను. మా మధ్య కలతలు రేగాయి: క్రమంగా ఆయను మధ్యాహ్నం భోజనానికి ఇంటికి రావటం మానివేశారు. రోజూ కేంటిన్‌లో తింటున్నారని తెలిసి నిలదీశాను.

"మీరు మధ్యాహ్నం భోజనానికి ఇంటికి ఎందుకు రావటం లేదు?"

"నాకు ఇంటికి హోటలుకి తేడా ఏముందని? ఈపాటి కూడు అక్కడే ఏ హోటలువాడు అయినా పెడతాడు...." అన్నారు. నాకు కోపం వచ్చింది.



యాళ్ళబండి శారదాదేవి

హరికథలు చెప్పడంలో–కొన్ని దశాబ్దాల క్రితం స్త్రీలు కూడా బాగా కృషిచేశారు. రామ రామ, హరికథ కళకు ప్రోత్సాహం తగ్గిపోతున్నట్టే, స్త్రీలకు కూడా ఆ కళలో ఉత్సాహం సన్నగిల్లుతూ రాసాగింది. అయినా, అలాంటి ఉత్సాహం వున్నవాళ్ళు అక్కడా అక్కడా లేకపోలేదు. అందులోనూ పెద్ద చదువులు చదువుకుని, హరికథలు చెప్పడంలో ఉత్సాహం చూపేవారు చాలా అరుదు-అని కూడా చెప్పవచ్చును. కుమారి యాళ్ళబండి శారదాదేవి అలాంటి అరుదైన వనిత. ఆమె ఈ విద్యను తండ్రిగారైన యాళ్ళబండి తాతారావు భాగవతార్‌గారి దగ్గర మంచి సంక్రమింపజేసుకున్నది. తాడేపల్లి గూడెం, భీమవరం కళాశాలలలో చదువుకుని, శారదాదేవి ఎమ్.ఎ పట్టం పుచ్చుకున్నది.

రామాయణం, భారతం, భాగవతాలలో వున్న కథలనే కాకుండా, దేశ నాయకుల చరిత్రలను కూడా హరికథా విధానంలో చెబుతూ, ప్రేక్షకులను రంజింపజేస్తుందామె. చాలా వూళ్ళలో వివిధ సందర్భాల్లో శారదాదేవి హరికథలు జరిగాయి. ప్రేక్షకుల్లో వున్న స్త్రీలనూ, వృద్ధులనూ, పిల్లలనూ అందర్నీ రంజింపజేస్తూ 'కథ అప్పుడే అయిపోయిందా' అన్న భావాన్ని శారదాదేవి కలగజేస్తుందని–ఆమె కథలు విన్నవాళ్ళు అభిప్రాయపడతారు. శారదాదేవికి, 'కథా గాన కళావిశారద' అన్న బిరుదు కూడా వున్నది.

"అంటే? మీ దృష్టిలో ఇంటికి ఒక విలువ అంటూ లేదన్న మాట?"

కనుబొమలు ముడిచి సూటిగా నా కేసి చూశారు.

"ఆ విలువ నువ్వు వుండనిస్తేకదా. సుధా! సత్రపు భోజనం మఠం నిద్ర అన్నట్లు బ్రహ్మచారిగ నా జీవితం ఎలా గడిచిందో నువ్వు వచ్చాకా అలాగే గడుస్తోంది. ఆ వంట మనిషి వంట తిని తిని నా నాలిక చచ్చుబడిపోయింది. పెళ్ళి చేసుకున్నాను. నా ఇల్లాలు నా ఇంటికి వచ్చింది కదా అని ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. నేను వచ్చేసరికి ఏ రోజైనా నువ్వు ఇంటిపట్టున వున్నావా? నువ్వు వంట చెయ్యకపోతే పోనీ.... ఈ ఆరునెలల్లో ఏ రోజూ అయినా నా దగ్గర వుండి నీ చేతుల్తో కొసరి కొసరి వడ్డించావా? నా అవసరాలు కనుక్కున్నావా? నేను ఆఫీసుకి వెళ్ళేవరకు నా వెంట వుండి నా అక్కరలు గమనించటం నీకు అవమానం! నా కోటుగుండి కుట్టిపెడితే నీకు నామోషి! నా పెన్ను వెతికి పెట్టటం బానిసత్వం! మొన్న కర్చీఫ్ కనుపించకపోతే కొత్తది కొనుక్కున్నాను. తరచూ సైపిన్స్ పోతున్నాయ్! నీ దృష్టిలో ఇలాంటి పన్లు అన్నీ బానిసత్వం కిందికి వస్తున్నాయి. భర్త అవసరాలు చూడటం తప్పా! ఇలాంటివి అడిగి అధికారంతో చేయించుకునేవి కాదు. ప్రేమ అభిమానంతో నీకుగా నువ్వు చెయ్యాల్సినవి! మొన్నటికి మొన్న నా పర్సులో డబ్బు పోయింది. ఇది నాలుగవసారి పోవటం! నీకు తియ్యాల్సిన అవసరం లేదు. కాని ఎవర్ని అని అడగను? ఇంట్లో తరచూ ఖరీదయిన చిన్న చిన్న వస్తువులు మాయం అవుతునే వున్నాయ్. పనివాళ్ళ మీద ఆధారపడితే ఇంతే! మొన్నటిదాకా పెళ్ళి చేసుకుంటే ఈ బాధలు వుండవు. నిశ్చింత అనుకునేవాడ్ని! కాని నువ్వు వచ్చాక నాకు జరిగింది ఏమిటి? నీకు భర్తకంటె గృహ బాధ్యత కంటే క్లబ్బులు, సంఘసేవా ముఖ్యం! వున్నది మనం ఇద్దరం మనుష్యులం అయినా లెక్కకి మించిన దుబారా జరుగుతోంది. నా యిల్లు–నా సంసారం అన్న ఆపేక్ష నీకు లేకపోయిన తరువాత నేను ఎంతకని పట్టుకుని ప్రాకులాడను? మధ్యాహ్నం పూట ఎండనిపడి ఆ స్కూటరు మీద అంతదూరం నుంచి ఎంతో ఆకలితో వచ్చేవాడిని. నువ్వు ఆప్యాయంగా వడ్డిస్తే నీతో

కలిసి తినాలని కోరుకునేవార్ని. కాని నాకు మిగిలింది నిరాశ! సాయంత్రాలు ఆఫీసు నుంచి తొందరగా ఇంటికి వస్తే నువ్వు ఇంట్లో వుండేదానివికాదు! అప్పుడు నా మనస్సు ఎలా వుంటుందో ఆలోచించు! భార్యాభర్తల మధ్య బానిసత్వం అన్న భావం వుంటే ఆ దాంపత్యమే దెబ్బతింటుంది."

"..............."

"పెళ్ళాం పిల్లల్ని పట్టించుకోకుండా క్లబ్‌ల వెంట, లాడ్జింగుల వెంట తిరిగే తాగుబోతు భర్తల గురించి మహిళా మండలిలో ఉపన్యాసాలు ఇచ్చేముందు–భర్త, సంసారం పట్టకుండా సంఘ సేవ అంటూ రోడ్లు పట్టుకుని తిరిగే నీలాంటి ఆడవాళ్ళ గురించి కూడా ఆలోచిస్తే బాగుంటుంది. నీకు ఆర్థిక స్వాతంత్ర్యం వుంది. లక్షాధికారి కూతురివి. ఇరవయ్యవ శతాబ్దపు చదువుకున్న ఆడపిల్లవి! భర్తని లెక్క చెయ్యవలసిన అవసరం ఏమిటి? సంసార తాపత్రయం నీకెందుకు?...." అన్నారు ఆత్రంగా.

సీతా! ఎంతో సౌమ్యంగా లాలిత్యంగా వుండే ఆయనలో అంతటి ఆవేశం నన్ను ఆశ్చర్య చకితను చేసింది.

కొత్తలో నా తిరుగుళ్ళకి అలవాట్లకి ఆయన ఆక్షేపణ తెలిపారు. అభ్యంతరం చెప్పారు. అయినా నేను లక్ష్యపెట్టలేదు.

నేను గతిలేక ఆయింటికి రాలేదని అరలక్ష కట్నంతో వచ్చానని చెప్పాను.

అంతే!

ఆయన మళ్ళీ నా జోలికి రాలేదు. నన్ను ఏ విషయంలోనూ పట్టించుకుని ఆదేమని ప్రశ్నించలేదు.

కాని....కాని....మా యిద్దరి మధ్య క్రమంగా దూరం పెరిగింది. ఆయన క్లబ్‌కి అలవాటు పడ్డారు. ఒక్కోరోజు అర్థరాత్రి దాకా పేకాడి "డ్రింక్" చేసి వచ్చేవారు. ఆదేమని అడిగే అర్హతని పోగొట్టుకున్నాను.

సరిగ్గా ఈ వాతావరణంలోనే మా యింటి గెస్ట్ హవుస్‌కి ఒక జంట కాపురానికి వచ్చారు.

అతడు చాలా చిన్న ఉద్యోగి. భార్యా ఇద్దరు పిల్లలతో చాలా పొదుపుగా అతి సామాన్యంగా వుండేవారు. ఏ పండగకో సినిమాకి అరుదుగా వెళ్ళేవారు. అతని భార్యకి మంచి బట్టలుగాని చెప్పుకోతగ్గ నగలుగాని లేవు. అయినా ఎప్పుడూ

### అపూర్వ సోదరులు!

ఈ మధ్య పశ్చిమ జర్మనీలోని ఒక న్యాయస్థానంలో చిత్రమైన ఉదంతం బయటపడింది. ఒక జర్మన్ యువతికి తన దేశస్థుడితోనూ, అమెరికన్ నీగ్రో సైనికుడితోనూ కొంతకాలంగా సంబంధం వుందట. వారిరువురి వల్లా ఆమె ఇద్దరు కవల పిల్లలను కన్నది. అందులో ఒకడు తెల్లగానూ మరొకడు నల్లగా నీగ్రోలాగానూ జన్మించారు! ఆ కవల పిల్లలలో తెల్లబ్బాయి జర్మన్ దేశస్థుడి కుమారుడేనని వాదించి – విఫలురాలయి – చివరికి కోర్టులో కేసు పెట్టింది – ఆ యువతి. అతను ససేమిరా తన కొడుకు కాదని వాదించాడట. కోర్టువారు కూడా అతని తరవున తీర్పు యిస్తూ ఆమె పిటీషను త్రోసి పుచ్చారు. అందుకు కారణం ఆ యువతికి అదే సమయంలో ఎందరో యువకులతో సంబంధం ఉండడమే నట! దాంతో ఆ యువతి మరో యువకుడిని వివాహం చేసుకుంది. ఆ కవల పిల్లలిద్దరికీ రక్షణ కల్పించబడింది. కాని సైంటిస్టులు మాత్రం అసలీ విపరీతం ఎలా సంభవించిందా అని తీవ్రంగా ఆలోచిస్తున్నారట. ఆమె కవల పిల్లలను ఆ విధంగా కనడానికి కారణం–ఒకే రోజు ఆ తెల్ల జర్మన్, నల్ల అమెరికన్ నీగ్రో వ్యక్తుల సంతాన కణాలు ఆమె గర్భాశయంలోని 'ఓవమ్'తో ఐక్యత చెందడమేనని వారు భావిస్తున్నారట. ఏమైనా ఇది విచిత్రమే!

సంతోషంగా నవ్వుతూ వుండేది. సహజ సౌందర్యంతో సంసారపక్షంగా శాంతంగా వుండేది. ఇంటిపన్లు అన్నీ........స్వయంగా చూసుకునేది. దంపతులు ఇద్దరూ పాలూ–తేనెలా అన్యోన్యంగా వుండేవారు.

మా మేడ మీద నిల్చుంటే వాళ్ళ సంసారం మొత్తం చూడవచ్చు.

రాత్రిళ్ళు పెరట్లో చాపలు పరుచుకొని పడుకునే వారు. వెన్నెట్లో కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేసేవారు.

ఒక రోజు ఈయనతో అన్నాను:

"అతనికి అంత తక్కువ జీతం కదా–అయినా కొంచెం కూడా చింతపడినట్లు కనుపించడు! ఎప్పుడు చూసినా నవ్వుతూ కనుపిస్తాడు!" అన్నాను యథాలాపంగా.

"ఆ అదృష్టం మాత్రం ఎంతమందికి వుంటుంది? డబ్బుదేముంది సుధా! అతనికి అంత అనుకూలవతి అయిన భార్య వుంటే నిశ్చింతకాక మరి ఏమిటి? మగవాడు బయట ఎన్ని బాధలు పడినా ఎంత శ్రమపడినా ఇంటికి వచ్చేసరికి ఇల్లాలి ఆప్యాయత–ప్రశాంతమైన చల్లని వాతావరణం వుంటే ఎంత అశాంతినైనా మర్చిపోవచ్చు........" అన్నారు. అప్రయత్నంగానే ఆ అమ్మాయి నడవడిని సౌమ్యతని మెచ్చుకున్నారు. అంతేకాదు. వీలు చిక్కినప్పుడల్లా ఆ అమ్మాయి కేసి చూడటం, ప్రశంసించటం నేను గమనించాను.

సీతా! ఆయన దృష్టిలో ఆ అమ్మాయి ఒక దేవత. ఆమెతో జీవితం ఒక స్వర్గధామం!

ఆయన సహృదయంతోనే ఆమెని మెచ్చుకునే వారేమో....

కాని ఆయన అంతరాంతరాలలో ఆమెపట్ల ఆరాధనభావం వుందేమోనన్న అసూయ నా మనసుని రగిలించింది. "అలాంటి భార్య కోసం ఆయన తపిస్తున్నారా?" అన్న ఆలోచన నన్ను దహించింది. ఆయన నాకు దూరం అవుతున్నారేమోనన్న బాధ అప్పటికే నాలో రాజుకుంటున్నది. కాగా నా ఎదురుగానే ఒక సామాన్యమైన అమ్మాయిని ఆయన మెచ్చుకోవటం సహించలేకపోయ్యాను. నా వ్రేలితో నా కన్ను నేనే పొడుచుకుంటున్నానేమో! చేజేతులా నా సంసారాన్ని నేనే కూలద్రోసుకుంటున్నానేమో నన్న మథన చెలరేగింది. నాలో అంతవరకు విశ్రాణమైవున్న వివేకం తట్టి పిలిచినట్లుగ మేల్కొంది.

"భర్తకి వండిపెట్టటం బానిసత్వం అని స్త్రీలు, భార్యా బిడ్డల్ని పోషించటం ఊరికి వుపకారం అని పురుషులు అనుకోవటం ఎంత అవివేకం! సృష్టిలో స్త్రీకి పురుషుడు–పురుషుడికి స్త్రీ బానిసలే. ఆ బానిసత్వంలోనే అందం వుంది. ఆనందం వుంది." అని తెలుసుకున్నాను.

అంతే!

నేను మారాను.

ఒక నెల్లాళ్ళపాటు వంటమనిషి దగ్గర వంట నేర్చుకున్నాను. తరువాత ఆయన్ని సంప్రదించకుండానే వంట మనిషిని మానిపించాను.

తరువాత నా చేతుల్తో నేను వంట చేసిపెట్టిన రోజు ఆయన కళ్ళల్లో కనుపించిన ఆనందం, ప్రశంసా నేను జన్మలో మరువలేను!

కాని అనాటి నా వంటకాల్లో చాలా లోపాలు వున్నాయి. ఆయన సంతుష్టిగా తినలేకపోయారేమో అనిపించి "ఫ్రిజ్"లోంచి పళ్ళు తెచ్చి అందించాను.

"నిజం చెప్పండి. మీకు కడుపు నిండలేదు కదూ?" నిస్సహాయతతో నా కళ్ళు తడిశాయ్.

"ఛ....ఛ....అదేం పని?" అంటూ ఆప్యాయంగా ఆయన నా చేతిని పట్టుకున్నారు.

"సుధా! నీ పేరులోనే కాదు. నీ చేతుల్లోనే అమృతం వుంది. ఈ రోజు వంట పెద్దగా బాగుండని మాట వాస్తవమే. కాని నువ్వు దగ్గర వుండి తినిపిస్తుంటే ఎంత ఆనందంగా వుందో చెప్పలేను. ఇంతటి ఆప్యాయత వంటవాళ్ళు వడ్డిస్తే వస్తుందా చెప్పు? ప్రాక్టిస్ మేక్స్ ఎ మాన్ పర్‌ఫెక్ట్ అన్న సామెత వినలేదా? క్రమంగా నీకే అలవాటు అవుతుంది" అన్నారు.

సీతా! అదిగో....అప్పటి నుంచే నా జీవన సరళి మారిపొయ్యింది. ఆ మార్పు నాలో మనస్ఫూర్తిగా స్వచ్ఛంగా వచ్చింది. అందుకే ఇంత ఆనందం. ఇప్పుడు ఆయనకి నా మాటే వేదం. నాకు ఆయన తోటే లోకం!

అంతటి అప్టుడేట్ గరల్ సుధారాణి ఏమిటి? అమ్మమ్మ లాగ మాట్లాడుతోంది? అనుకుంటున్నావా?

సీతా! నిజం చెప్పాలంటే మన అమ్మమ్మలు బ్రతికినంత నిశ్చింతగా ఇప్పుడు మనలో ఎంత మంది జీవిస్తున్నారంటావ్?

ఇప్పటికే చాలా పెద్ద ఉత్తరం అయి ంది కదూ! మరి వుంటా. ప్రేమతో నీ

సుధారాణి—"

*

ఉత్తరం చదవటం పూర్తి చేసిన సీత పెదవులు చిరునవ్వుతో అందంగా వంపు తిరిగాయ్.

"సీతా! మై స్వీట్! ఆకలి మండిపోతోంది. తొందరగా భోజనం వడ్డించేయ్. లేకపోతే...." హడావుడిగా లోపలికి వస్తున్న భర్తగారి కేకలతో ఈ లోకంలోకి వచ్చింది సీత.

"అరే! తమరు అప్పుడే వచ్చేశారే?" అంటూ ఉత్తరం టేబిల్‌పై వుంచి, ఒక్క ఉదుటన మరింత ఉత్సాహంతో వంట గదిలోకి పరిగెత్తింది. సీత – ఉత్తరంలోని విషయాలను మననం చేసుకుంటూ. □

## పద్మాల ముగ్గు

ఇది ఎండాకాలం. అంటే సూర్యుడి ప్రభావం ఎక్కువగా గల కాలం. సూర్యుడు అంటే ఈ కాలంలో మనం చిరాకుపడినా, తామర పువ్వులకు మాత్రం ఎప్పుడూ సూర్యుడంటే ప్రియమే. అందుకనే ఈ ఎండాకాలంలో మరొక రకమైన పద్మాల ముగ్గు. ఇది వెయ్యడానికి – ముందుగా పదహారు చుక్కలు అడ్డంగా పెట్టుకోవాలి. తర్వాత ఒక్కొక్క చుక్క తగ్గిస్తూ–(15, 14, 13, 12 అలా) ఒక చుక్క వచ్చేవరకూ పైనా కిందా చుక్కలు పెట్టుకోవాలి. తర్వాత బొమ్మలో చూపినట్టుగా ఒక పద్మాన్ని చుక్కలతో కలిపి, అలాగే తక్కినవీ కలపాలి. —రాజీ హరిశ్చంద్ర (బి. ఎస్ సి)

